క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి



ర్యాలీలో పాల్గొన్న ఫారెస్ట్ సెక్షన్ అధికారి వర్మ, బీట్ అధికారి వసంత

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి వి.వి.ఎస్.కె.వర్మ అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలని ఆయన కోరారు. కింతాడలో బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మొక్కలను విరివిగా పెంచితే సకాలంలో వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారి ఆర్.వసంత, బి.యాదగిరి, అప్పారావు పాల్గొన్నారు.

164 మందికి వైద్యసేవలు



గొల్లలపాలెంలో ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: గొల్లలపాలెంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 164 మందికి వైద్య పరీక్షలు జరిపి, మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్యాధికారి నిర్మల తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఇవో కె.వి.రాజశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ మూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ బి.రాము, రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేత



క్రికెట్ కిట్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు రామకృష్ణ

రోలుగుంట: పడాలపాలెంలో విద్యార్థులకు సర్పంచ్ సత్యవతి, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు పాచిలి రామకృష్ణ తమ సొంత సొమ్ము రూ.8,000తో కొనుగోలు చేసిన క్రికెట్ కిట్‌ను అందజేశారు. గ్రామంలో క్రికెట్ క్రీడాకారులు సర్పంచ్ సత్యవతిని కలిసి క్రికెట్ కిట్ సమకూర్చాలని అభ్యర్థించారు. దీంతో వెంటనే స్పందించిన రామకృష్ణ వారికి కిట్ అందజేశారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



బోయిలకింతాడలో వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ బూరె బాబూరావు

దేవరాపల్లి: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని బోయిలకింతాడ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు అన్నారు. బుధవారం బోయిలకింతాడ వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె. చంద్రశేఖర్‌రావు తదితర్లు పాల్గొన్నారు.

మహేష్ సేవలు చిరస్మరణీయం



మహేష్ తల్లి,భార్యను ఓదార్చుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: దేశానికి సేవ చేసే భాగ్యం అందరికీ లభించదని, మహేష్ భౌతికంగా లేకపోయినా ఆయన జవాన్‌గా దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఇటీవల ఢిల్లీలో మృతి చెందిన ఆర్మీ జవాన్ మదుమంతి మహేష్ స్వగ్రామమైన దిబ్బలపాలెంలో ఆయన ఇంటికి బుధవారం డిప్యూటీ సీఎం వెళ్లారు.ఈ సందర్భంగా జవాన్ తల్లి సింహాచలమ్మ,భార్యను ఓదార్చారు.కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు కురచా నారాయణమూర్తి,నందారపు రమణబాబు,దారపు సత్యనారాయణ ఉన్నారు.

అన్నదాతకు అండగా...

- రూ.1.09 కోట్ల వడ్డీ రాయితీ విడుదల
- 9071 మంది సహకార సభ్యరైతులకు లబ్ధి



డీసీసీబీ చోడవరం బ్రాంచి కార్యాలయం

చోడవరం రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. త్వరితగతిన వారికి సహాయం అందించడంలో ప్రభుత్వం ముందుంటోంది. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు సకాలంలో వడ్డీ రాయితీ అందజేస్తూ వారికి అండగా ఉంటోంది. ఈ ఏడాది వడ్డీరాయితీని ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చోడవరం బ్రాంచి పరిధిలోని 13 సహకార సంఘాలకు రూ.1,09,79,229 విడుదల అయ్యాయి. 9,071మంది సభ్య రైతులకు లబ్ధి చేకూరింది. వారి ఖాతాలకు వడ్డీ రాయితీ సొమ్మును జమచేశారు.

వడ్డీ రాయితీ వివరాలు

పీఏసీఎస్	సభ్య రైతులు	వడ్డీ రాయితీ(రూ.)
భోగాపురం	503	6,18,159
బుచ్చియ్యపేట	1,165	12,37,977
చీడికాడ	974	13,43,962
చోడవరం	921	12,77,330
దండి సురవరం	817	9,17,492
గవరవరం	370	4,34,289
గోవాడ	731	7,39,274
జన్నవరం	867	10,84, 255
జుత్తాడ	537	5,94,934
లక్కవరం	660	8,39,939
లక్ష్మీపురం	402	4,73,130
రాయపురాజుపేట	540	6,83,939
విజయరామరాజు పేట	584	7,34,646

వడ్డీరాయితీ సొమ్ము రైతులకే చెల్లిస్తున్నాం



బ్రాంచి పరిధిలోని 13 ప్రాథమిక సహకార సంఘాలకు విడుదలైన వడ్డీ రాయితీ సొమ్మును సభ్యరైతులకే చెల్లిస్తున్నాం. ఆయా సొసైటీలలో వారివారి ఖాతాలకు మంజూరైన రాయితీని జమచేస్తుండగా కొందరు రైతులు వాటిని తమ అవసరం మేరకు వాడుకుంటున్నారు. మరి కొందరు రుణ ఖాతాలకు జమ చేసుకుంటున్నారు.

– కోడూరు శ్రావణ్‌కుమార్, బ్రాంచి మేనేజర్, డీసీసీబీ, చోడవరం బ్రాంచి

సకాలంలో వడ్డీ రాయితీ



సహకార సంఘాలు సజావుగా పని చేయడానికి సకాలంలో విడుదల చేస్తున్న వడ్డీ రాయితీ ఎంతగానో ఉపకరిస్తోంది. రైతులు ఉత్సాహంగా రుణబకాయి చెల్లిస్తున్నారు.

–మూదెడ్ల మహాలక్ష్మి, డైరెక్టర్, డీసీసీబీ, విశాఖపట్నం.

సంక్షేమ వారధులు వలంటీర్లు

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధులుగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మండలస్థాయి వలంటీర్ల వందనం కార్యక్రమాన్ని మెట్టపాలెం సచివాలయం వద్ద బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగనమోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పథకాలను ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న వలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. దీనిని అమలు చేసేందుకు ఇతర రాష్ట్రాలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. వలంటీర్లను ప్రజలు తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారన్నారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం పది మంది వలంటీర్లకు నగదు, సేవా పురస్కారాలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైస్ ఎంపీపీ తాతబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, ఎంపీడీవో జయమాధవి, ఎంపీడీవో కార్యాలయం ఏవో రమణబాబు, మండలసచివాలయ కన్వీనర్ శానపతివెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకుడు సింహాచలం, సచివాలయ కన్వీనర్లు పైల తాతాజీ, కూండ్రపు నాగమణి, బండారు హరిప్రసాద్, అమలాపురం సర్పంచ్ శెట్టి అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళా కానిస్టేబుల్ మృతి



మృతి చెందిన కృష్ణవేణి(ఫైల్)

గొలుగొండ: లింగంపేట గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ కొరుప్రోలు కృష్ణవేణి(28) అనారోగ్యంతో మృతిచెందారు. మంగళవారం సాయంత్రం కార్యాలయం నుంచి ఇంటికి వెళ్లిన కృష్ణవేణికి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి విశాఖపట్నం తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. కృష్ణవేణి మృతదేహం వద్ద గ్రామ సచివాలయం సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది బుధవారం నివాళులర్పించారు.

జల్‌జీవన్ మిషన్‌లో 27 పనులు పూర్తి

మాకవరపాలెం: జల్‌జీవన్ మిషన్‌లో చేపట్టిన 27 పనులు పూర్తయినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి బుధవారం తెలిపారు. మండలంలో మొదటి విడతగా 67 పనులకు రూ.12 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో పనులు ప్రారంభించగా ఇప్పటికి 27 పనులు పూర్తి చేసి, కుళాయిల ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామన్నారు. వచ్చేనెల మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లు



వలంటీర్లను సత్కరించి పురస్కారాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వలంటీర్లని, ప్రజా సేవ కోసమే వలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరంలో ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణంలో వలంటీర్లకు బుధవారం పురస్కారాలను అందజేశారు. చోడవరం 1,2,3,4,5 సచివాలయాలతోపాటు వెంకన్నపాలెం, గంధవరం, ముద్దుర్తి గ్రామ సచివాలయ పరిధిలో సేవా మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని పథకాలు నేరుగా ప్రజల ఇంటికే అందుతున్నాయంటే అది కేవలం వలంటీర్ల వ్యవస్థ వల్లేనని ధర్మశ్రీ అన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చైతన్య, ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు, సర్పంచ్‌లు బండి నూకాలమ్మ, మొల్లి ఈశ్వరరావు, పల్లా నర్సింగరావు, మండల వర్కింగ్‌ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, డీఆర్‌యూసీ సభ్యుడు బొడ్డు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేజేపురంలో వెంకన్న కల్యాణోత్సవాలు



కె.జె.పురం కల్యాణ వేంకటేశ్వర స్వామి

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 13వ వార్షిక కల్యాణోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఆలయ కమిటీ చైర్మన్ రాపేట రామకొండలరావు, ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం పెళ్లిరాట కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 30న పుట్టమన్ను తేవడం, నిజరూపదర్శనం, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 31న ఎదురుసన్నాహం అనంతరం వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణం, మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 4వ తేదీ ఉదయం వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు ఊంజల్‌సేవ, పవళింపు సేవలతో ఉత్సవాలు ముగిస్తాయని వారు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

వీరవల్లి అగ్రహారంలో అమ్మవారి దీక్షలు



మోదమాంబ పీఠంలో దీక్షలో ఉన్న భక్తులు

మాడుగుల రూరల్: మండలంలోని వీరవల్లి అగ్రహారం మోదమాంబ అమ్మవారి పీఠంలో అమ్మవారి దీక్షలను ప్రారంభించినట్టు పాలకుర్తి శ్రీనివాసరావు, మంగరాజు బుధవారం తెలిపారు. 30 మంది భక్తులు అమ్మవారి మాలాధారణ చేశారు. ప్రతి రోజు, ఉదయం సాయంత్రం పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈనెల 28న అమ్మవారికి 101 బిందెల నీళ్లతో అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. 30న అమ్మవారి ఘటాల సంబరం, సారె ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 4వ తేదీన గ్రామం నుంచి కాలినడకన మాడుగులకు వెళ్లి ఆలయంలో పూజలు నిర్వహించి, అనంతరం సతకంపట్టు వద్ద దీక్షా కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి

సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాసురాజు



నాయీ బ్రాహ్మణుల సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి వాసురాజుని సన్మానిస్తున్న మండల కమిటీ సభ్యులు

రోలుగుంట: నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తానని నాయీబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి వాసురాజు చెప్పారు. కొవ్వూరు నూకాల తల్లి గుడి వద్ద బుధవారం నాయీబ్రాహ్మణుల సంఘం మండల స్థాయిలో కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ఉప్పలపు వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా నర్సింగరావు, ప్రధానకార్యదర్శిగా ఉప్పలపు గణపతి, గౌరవ అధ్యక్షుడిగా యర్రవరపు అప్పారావు, వర్కింగ్ ప్రెసిడెంటుగా ఉప్పలపు మురళి, కోశాధికారిగా అచ్చిబాబు ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీని వాసురాజు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సమస్యలను ఇప్పటికే ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పోతలడ లక్ష్మీ రమణమ్మకు తెలియజేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో కె.నాయుడుపాలెం తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రచారకార్యదర్శి వాసురాజును దుశ్శాలువాతో సత్కరించారు.

సాగును లాభదాయకం చేసేందుకే పొలంబడి



మాట్లాడుతున్న సహాయ సంచాలకుడు దాసు

కె.కోటపాడు : సాగును లాభదాయకంగా చేసేందుకు ప్రతి వారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు దాసు తెలిపారు. వారాడలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై మొదటి వారం నుంచి 14 వారాల పాటు పొలంబడి కార్యక్రమాన్ని వారాడలో జరపనున్నట్టు తెలిపారు. చోడవరం డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ పంట ప్రారంభం నుంచి కోతదశకు చేరుకునే సమయం వరకూ పొలంబడి కార్యక్రమాన్ని జరపనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్, కొండెంపూడి వ్యవసాయ పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, కిషోర్, విజేత, చిరంజీవి, సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, ఎంపీటీసీ లెక్కల నాగ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



పింఛన్ అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

చోడవరం: వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. చోడవరం వాసవీక్లబ్ అమలుచేస్తున్న పేదలకు పింఛన్ కార్యక్రమాన్ని క్లబ్ ప్రతినిధి కలగర్ల శేషు ప్రారంభించారు. క్లబ్‌లో ఉన్న పేదలకు నెలకు రూ.200చొప్పున అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. చోడవరం కొత్తూరు జంక్షన్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పసుమర్తి అశోక్, పుట్టా నరేష్, కోశాధికారి భోగవల్లి గణేష్, రీజనల్ చైర్మన్ కందుకూరి నాగేశ్వరరావు, మణికుమార్, కేతవరపు రామకృష్ణ, కిరణ్, చిట్టూరు నాని, రేపాక ఆదినారాయణ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కె.కోటపాడు : విద్యార్థి దశ నుంచే యోగాసనాలను నేర్చుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభించడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాలో ప్రతిభ చూపితే మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీసీఎం బూడి ముత్యాలనాయుడు



కట్టువాని అగ్రహారంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: గ్రామాల్లోని సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండలంలోని కట్టువాని అగ్రహారం,దిబ్బపాలెంలలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో పింఛన్లు పొందలేని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.
హౌసింగ్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. నూతన వాటర్ ట్యాంకు నిర్మాణానికి, ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.96 లక్షలు నిధులు కేటాయించారు. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. కోతకు గురైన ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలోని రోడ్డుకు రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. దివ్యాంగులు, వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. కొంత మందికి తన సొంతనిధులతో ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలతో ముచ్చటించారు. అంగన్‌వాడీల భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి,జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, చీడికాడ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు,విశాఖడెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ,మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య,దండిసురం పీఏసీఎస్ అధ్యక్షుడు నందారపు రమణబాబు,మాజీ ఎంపీపీ దారపు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షులు గొల్లవిల్లి స్వామినాయుడు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



అప్పలమ్మపాలెంలో ప్రజల సమస్యలను వింటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రావికమతం: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చెప్పారు. మేడివాడ, అప్పలమ్మపాలెం, దిడ్డి, బాదనపాడు గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ... ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. కాలువలు, సీసీ రోడ్లు పునర్నిర్మించాలని అప్పలమ్మపాలెం గ్రామస్తులు కోరారు. తమకు ఇళ్లు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన మదుమంతి చినతల్లి, పోతల రాజేశ్వరి,వెల్లంకి రమణమ్మ తదితరులు కోరగా తక్షణం మంజూరు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. మంచినీటి బోరు వేయించాలని, ఇంటింటికీ కుళాయిల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని దిడ్డి,బాదనపాడు గ్రామస్తులు కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, ఎంపీటీసీ గొర్లె సత్యారావు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసుగోవిందరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ కోటేశ్వరరావు, ముఖ్యనాయకులు పతివాడ ధనంజయరావు,పైల సత్యారావు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలో కొత్త రామచంద్రపురం, బుచ్చెంపేట,లింగంపేట గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ప్రజలకు అవసరమైన సేవలను సచివాలయాల ద్వారా గ్రామంలోనే అందిస్తున్నామన్నారు. అర్హత ఉండి ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. రేషన్ కార్డులు, ఇళ్లస్థలాలు, పింఛన్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. గ్రామం మధ్యలోంచి ప్రవహిస్తున్న కొండ గెడ్డపై వంతెన నిర్మించాలని సర్పంచ్ లోకవరపు రాము ఎమ్మెల్యేను కోరారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో పనులకు రూ.20లక్షల చొప్పున మంజూరు చేస్తానని, వాటితో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగ గోపి, తహసీల్దార్ కనకరావు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైల పోతురాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అడిగర్ల నాయుడు, జేఈ వెంకటేశ్వరమ్మ, వ్యవసాయాధికారి శైలజ, వెలుగు ఏపీఎం లక్ష్మి, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

నేడు సుందర కోట పంచాయతీలో..

మండలంలో సుందరకోట పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు.

రావికమతంలో జోరుగా ఆక్రమణల తొలగింపు



జోరుగా సాగుతున్న ఆక్రమణల తొలగింపు

రావికమతం: ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఆదేశాల మేరకు రావికమతంలో చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమం జోరుగా సాగుతోంది. స్థానిక బస్టాండ్ ప్రాంతం నుంచి మంగళవారం ఆక్రమణల తొలగింపు చేపట్టిన సంగతి తెలిసిందే. బుధవారం మరో పొక్లెయిన్ సాయంతో ఆక్రమణలు తొలగించారు. ఐదేళ్ల క్రితం ఆక్రమణల తొలగింపు చేపట్టినప్పుడు విజయ కూల్ డ్రింక్స్ యజమాని బాబ్జీ కోర్టు నుంచి స్టే తీసుకురావడంతో ఆ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వ్యాపారులు మళ్లీ కాలువలపై నిర్మాణాలు చేపట్టారు. దీంతో మురుగు ప్రవహించే మార్గం లేక ప్రధాన రహదారిపై పారుతోంది. ఆ పరిస్థితి గమనించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ.. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులకు తగిన ఆదేశాలిచ్చారు. రహదారికి ఇరువైపులా కాలువలపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఎవరైనా అడ్డుతగిలితే తక్షణం కేసులు నమోదు చేయాలని కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్‌కు ఆదేశించారు. దీంతో ఆక్రమణల తొలగింపు నిరాటంకంగా సాగుతోంది.

సత్తిబాబుకు నివాళి

నర్సీపట్నం: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సీపీఎం నాయకుడు సత్తిబాబు సంతాప సభను మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సత్తిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు కుపరాల రాజు, బొర్రా శ్రీనివాసరావు, యామగిరి రాజుబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.